క్లుప్తంగా

ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మండలంలోని మోట్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శీనప్ప కుమారుడు వేణుగోపాల్ మృతిచెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ మంగళవారం తన సతీమణి పావనిగౌడతో కలిసి ఆ గ్రామానికి వెళ్లారు. వేణుగోపాల్ మృతదేహానికి పూలమాలలు చేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బైక్ సహా కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ

బైరెడ్డిపల్లె: మోటార్ సైకిల్‌తో సహా కర్ణాటక మద్యం ప్యాకెట్టు స్వాధీనం చేసుకుని పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ క్రిష్ణయ్య మంగళవారం తెలిపిన వివరాలు..కైగల్ సమీపంలోని ఎక్స్‌ప్రెస్ హైవేలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. బైక్‌లో వచ్చిన ఓ యువకుడిని తనిఖీ చేయగా అతడి వద్ద 864 కర్ణాటక రాష్ట్రానికి చెందిన టెట్రా మద్యం ప్యాకెట్టు ఉన్నట్టు గుర్తించారు. కూటాలవంక గ్రామానికి చెందిన నటరాజ్ అని ప్రాథమిక విచారణలో తేలింది. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. తనిఖీలలో బైరెడ్డిపల్లె పోలీసులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం: ఇద్దరి అరెస్ట్


సారా కలిగిన వ్యక్తుల అరెస్టు చూపుతున్న సెబ్ అధికారులు

బంగారుపాళెం: సారా కలిగిన ఇద్దరు వ్యక్తులను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు చిత్తూరు రూరల్ సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. మండలంలోని రామరాజుపురానికి చెందిన మునస్వామిరాజు, శంకర్‌రాజు ప్లాస్టిక్ క్యాన్‌లో 5 లీటర్ల సారా తీసుకువెళ్తుండగా రాగిమానుపెంట సమీపంలో అరెస్టు చేశారు. వారి నుంచి సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా నాటుసారా, మద్యం విక్రయాలపై 9492814414కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్ఐ నాగరాజు, సిబ్బంది అలెగ్జాండర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై కోదండరాముడి కటాక్షం



తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం రాత్రి సర్వాంగ సుందరంగా శ్రీకోదండరామస్వామి గరుడ వాహనంపైనుంచి భక్తులకు దర్శనమిచ్చారు. గజరాజులు, వృషభాలు, అశ్వాలు ముందు కదులుతుండగా, భజన బృందాల కోలాటాల మధ్య భక్తజనం రామనామం నడుమ స్వామివారి గరుడ వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి దర్శించుకున్నారు. దీనికి ముందు ఉదయం 8 గంటలకు స్వామివారి పల్లకీసేవ వేడుకగా సాగింది. ఈ సందర్భంగా మోహినీ అవతారదారుడైన శ్రీరామచంద్రుడు పల్లకిలో కొలువై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. వాహన సేవ అనంతరం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరాముల వారి ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, వీజీఓ బాలిరెడ్డి, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, కంకణభట్టార్ సీతారామాచార్యులు టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, భక్తులు పాల్గొన్నారు.


వాహన సేవలో భజనలు చేస్తున్న కళాకారులు

ఘనంగా ఉగాది వేడుకలు

- పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ
- పలుచోట్ల ఉగాది పచ్చడి పంపిణీ


పుంగనూరు: ఏడూరులో లక్ష్మీనరసింహస్వామి


పలమనేరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు


పుంగనూరులో ప్రత్యేక పూజలందుకున్న భోగనంజుండేశ్వరస్వామి

పలమనేరు: పట్టణంలో క్రోధి నామ నూతన సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఉగాది పచ్చడి ప్రాశస్త్యాన్ని వివరించి షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన పచ్చడిని పట్టణంలో పంపిణీ చేశాయి. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.ఈ సంవత్సరం ప్రతి ఒక్కరికీ మేలు కలగాలని, విజయం వరించాలని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దల నుంచి పిల్లలు ఆశీస్సులు పొందారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంచాగశ్రవణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ కుటుంబ సమేతంగా పాల్గొని వేదపండితుల ఆశీర్వచనం పొందారు. నూతన తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ మేలు కలగాలని, భగవంతుని కృపతో వర్షాలు పుష్కలంగా కురిసి, పంటలు సమృద్ధిగా పండి, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితం ఆనందమయం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇదే కార్యక్రమాన్ని కరాటే క్లబ్ నిర్వాహకులు ఏఆర్ సురేష్ నిర్వహించి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పట్టణంలో రిక్రియేషన్‌క్లబ్ లోనూ ఉగాది వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, కౌన్సిలర్లు, నాయకులు, నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నేతలు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.


పలమనేరు: ఉగాది పచ్చడి, ప్రసాదాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా మంగళవారం శ్రీ క్రోధినామ నూతన తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటా గుమ్మాలకు వేపపూత, మామిడి తోరణాలు కట్టారు. వాకిళ్లను పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ఉగాదికి స్వాగతం పలికారు. పితృదేవతలను ఆరాధించుకుని ఉగాది పచ్చడిని పంచారు. అలాగే పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఏడాదంతా పంటలు సమృద్ధిగా పండి, వ్యాపారాలు బాగా జరగాలని ఇష్ట దేవతలకు పూజలు చేశారు.

వీ.కోటలో..

వీ.కోట: తెలుగు నూతన సంవత్సరాదిని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఏడాదిలో తెలుగు వారికి ఇది తొలి పండుగ కావడంతో తమ కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమాధుల వద్ద తళిగ వేసి పూజలు చేశారు. పితృదేవతలు, తమ ఆత్మీయుల ఫొటోల వద్ద బట్టలు పెట్టారు. ఇరుగు పొరుగు ప్రజలు ఉగాది పచ్చడిని పంచుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శ్రీ భోగనంజుండేశ్వరస్వామి ఆలయం, మండలంలోని ఏడూరులోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తిప్రపత్తులతో ఉగాది పూజలు నిర్వహించారు. అర్చకులు నటరాజ దీక్షితులు, మంజునాథ్ ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి పంచాగ శ్రవణం చేశారు. ప్రజలు ఉదయాన్నే స్నానమాచరించి, కొత్త దుస్తులు ధరించి, శ్మశానవాటికల్లో పితృదేవతలకు పూజలు చేశారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవళంపేటలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి లభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అనంతాచార్యులు పంచాగ పఠనం చేశారు. నూతన తెలుగు సంవత్సరాదిలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

ఫోటోరైటప్ 09పిజిఆర్31: పులిచెర్ల: దేవళంపేట ఆలయంలో ప్రత్యేక పూజలు

కుప్పంలో..

కుప్పం: కుప్పం పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా ఉగాది పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సోమేశ్వర స్వామి దేవాలయం, తిరుపతి గంగమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ప్రధానంగా ఉగాది పచ్చడి పంచారు. అలాగే శ్మశానంలో తమ పితృదేవతల సమాధుల వద్ద పూజలు చేశారు. పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమాధులపై ఉంచి పెద్దలు, తమ ఆత్మీయుల ఆత్మకు శాంతి కలగాలని పూజలు చేశారు.

రామకుప్పంలో..

రామకుప్పం: ఉగాది పర్వదినాన్ని మంగళవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక గంగమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు. సాయంత్రం శ్మశాన వాటికలో తమ పెద్దల సమాధులకు నూతన వస్త్రాలు పెట్టి పూజలు చేశారు. అలాగే గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. పిల్లలు వేపాకు, బెల్లం ఇచ్చి పెద్దల నుంచి ఆశీస్సులు పొందారు.


రామకుప్పం: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ


వీ.కోట: సమాధుల వద్ద పూజలు చేస్తున్న ప్రజలు


కుప్పం: శ్మశానంలో పిత్రృ దేవతలకు పూజలు చేస్తున్న ప్రజలు

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం


నవాబ్ పేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

పులిచెర్ల(కల్లూరు): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పంచాయతీలోని నవాబ్ పేట, ముప్పిరెడ్డిగారిపల్లె, వంకమద్దివారిపల్లెలో జోరుగా ప్రచారం చేశారు. పుంగనూరు శాసనసభ్యులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు తిరిగి అందాలంటే వైఎస్సార్ సీపీకి మరోసారి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చెంచురెడ్డి, సర్పంచ్ సులోచన, నాయకులు ఆనందరెడ్డి, అమరనాథరెడ్డి, ఖాదర్‌వల్లీ పాల్గొన్నారు.

గ్రామాల్లో పందులు పెంచొద్దు


పెంపకందారులతో మాట్లాడుతున్న అధికారులు

వి.కోట : గ్రామాల్లో పందులను పెంచరాదని, వాటిని ఊరికి వెలుపలకు తరలించాలని తహసీల్దార్ సురేష్ ఆదేశించారు. మండలంలోని కొంగాటం పంచాయతీ కొండేపల్లెలో పందుల పెంపకం వల్ల గ్రామంలోని పశువులు, ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్టు గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన వాస్తవ పరిస్థితులేమిటో తెలుసుకునేందుకు మంగళవారం ఎంపీడీఓ గోవర్ధన్, పోలీసులతో కలిసి ఆ గ్రామాని కి వెళ్లారు. పందుల పెంపకందారులతో మాట్లాడారు. పందులను గ్రామం నుంచి బయటకు తరలించాలని, గ్రామంలో సంచరించకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. ప్రజలకు పందుల వల్ల ఎలాంటి ఇబ్బందులు, సమస్యలూ తలెత్తకుండాచర్యలు తీసుకోవాలన్నారు.

తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ


తెలుగు క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: క్రోధి నామ సంవత్సర నూతన తెలుగు సంవత్సరాది క్యాలెండర్లను మండల ప్రభోద సేవా సమితి సభ్యులు మంగళవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. పత్రపల్లె కొత్తూరులోని జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభోద సేవా సమితి మండల అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ, నూతన తెలుగు సంవత్సరాది క్యాలెండర్లను ముద్రించి మండల ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాలెండర్లలో భగవద్గీత వచనాలు, తెలుగు పండుగల విశిష్టతలతో పాటు కాలసూచికలను అందరికీ అర్థమయ్యే భాషలో ముద్రించినట్లు జెడ్పీ చైర్మన్‌కు తెలియజేశారు.

కేంద్ర బలగాల కవాతు



బంగారుపాళెం: మండలంలోని 170 గొల్లపల్లె, టేకుమంద, బంగారుపాళెంలో మంగళవారం సాయంత్రం సీఐ లక్ష్మయ్య ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మీదుగా రాగిమానుపెంట క్రాస్ వరకు కవాతు చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఆయా గ్రామాల్లో ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించామన్నారు. ప్రజలు తమ ఓటు నిర్భయంగా వేసుకోవాలని కోరారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆలయ హుండీలో నగదు చోరీ

పూతలపట్టు: ఆలయ హుండీలో పగలగొట్టి నగదు చోరీ చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీ శ్రీనివాసపురంలోని శ్రీవేంకటేశ్వరాలయానికి తాళం వేసి సోమవారం రాత్రి ఆలయ నిర్వాహకులు ఇంటికి వెళ్లిపోయారు. మంగళవారం తెల్లవారుజామున 1 నుంచి 5 గంటల ప్రాంతంలో ఆలయంలో దొంగలు పడ్డారు. హుండీని పగలగొట్టి నగదును అపహరించారు. మంగళవారం ఉదయం పూజా కార్యక్రమాల కోసం ఆలయానికి వచ్చిన పూజారి, నిర్వాహకులు తలుపులు తెరిచి ఉండడం చూసి దొంగలు పడినట్టు గ్రహించారు. సమాచారమివ్వడంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. హుండీలో సుమారు రూ.30 వేల నుంచి రూ. 40 వేల మధ్య ఉంటుందని స్థానికులు తెలిపారు.


ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


'రంజాన్ తోఫా' పంపిణీ

పలమనేరు: పట్టణంలోని 19వ వార్డు ఎంబీఎస్ కాలనీ, నీళ్లకుంట, దండుమిట్ట, నాగమంగళం గ్రామాల్లోని ముస్లింల కుటుంబాలకు ఆ వార్డు కౌన్సిలర్ రాజేష్ మంగళవారం రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. వార్డులోని ముస్లింలు రంజాన్‌ను పండుగను ఘనంగా జరుగపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

నాలుక మడత పెట్టి..

జింగిచకా..జింగిచకా..!

- అప్పుడో మాట..ఇప్పుడో మాట!
- పాత వీడియోల్లో అలా..
- కొత్త వీడియోల్లో ఇలా..
- వీళ్లనెట్లా నమ్మేది సామీ..!



''హరన్నా..! ఈ నాయకులు చెప్పే మాటలు సెల్‌ఫోన్లో చూస్తాంటే వీళ్లని ఎట్లా నమ్మాల్లో నాకైతే దిక్కు తెలీ లేదన్నా అన్నాడు శివ. నేను ఫోనులో వీడియోలు చూస్తాంటే ఒకటే డౌట్లొస్తాందాయన్నా... ఇప్పుడు కూటమిలో నాయకులుందారు గదా.. చంద్రబాబన్న ఇంతకు ముందు కాంగ్రెస్సోళ్లతో చెయ్యి కలిపి, మనదేశంలో 26 పార్టీలను ఒక్కటి చేసి, పీఎం నరేంద్రమోదీని పెళ్లాం లేనోడు.. దేశాన్ని ఏం పాలిస్తాడు?.. ఆయన అధికారంలోకొస్తే సాయిబులోళ్లపై దాడులు తప్పవు..మసీదులుండవని మైకులు వణికేలా గట్టిగా అరచి.. అరచి చెప్పినాడు కదనా..మరి మొన్నటికి మొన్న చిలకలూరిపేటలో ఇదే పెద్దమనిషి అబ్బబ్బబ్బా..! నాలుక ఏం మడత తిప్పేస్నాదునా..! మోదీని జింగిచకా..జింగిచకా అని ఏం భజన చేస్నాడునా?.. రెండు వీడియోలు చూసినా.. నేను దేన్ని నమ్మాల్లో అర్థమే కాలేదన్నా..''అని రాజకీయ జగన్నాటకం మీద ఆపకుండా చెప్పుకొచ్చినాడు.. ''ఔను బా.. శివా నిజమే.. నేన్కూడా చూస్నా.. పవన్‌కళ్యాణేమైనా తక్కువనుకుంటివా..? పోయినతూరి ఎలక్షన్‌లో చంద్రబాబుని ఎన్ని తిట్టలేదు చెప్పు?.. రాజధాని అమరావతి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారమని, చంద్రబాబు అండ్ కో ఇక్కడి భూములను తక్కువ రేటుకు కొట్టేసి..కోట్లు..కోట్లు కొట్టేసినారని ఊగి..ఊగి..'పవన్‌తాండవం' చేస్నాడు కదా..చంద్రబాబును దించేస్తాం..పొడిచేస్తాం..అని ఓ అని పీక తెగేలా అరిచిన ఆయన..చంద్రబాబును జైల్లో కలిస్నాక నాలుక మడత పెట్టేస్నాడు కదా!? ఆయన బాబుకే జై కొట్టే కాడికి ఆ గ్లాసు పార్టీ వోళ్లకే మైండ్ బ్లాకైంది కదబా..ఆయన కూడా చంద్రబాబును జింగిచక..జింగిచకా అని పొగడ్తాండాడు.. అంతేకాదు బా..మళ్లీ బీజేపీ వోళ్లని కూడా 'సైకిలెక్కిపిచ్చి' ఈయన డబ్బానే కాకుండా వాళ్లందరి డబ్బా కూడా కొడతాంటే భలే కామెడీగుందియా! జనసేనోళ్లు జనాల కాడికిబోయినప్పుడు జనాలు అడిగే మాటలకి తలకాయలు యాడబెట్టుకోవాలో తెలీక 'పగిలిన గ్లాసు'లో టీ తాగేసి తలకాయలు దించుకుని పోతాండరంట..! పగోడికి కూడా ఈ మాదిరి రాకూడదుయా..అట్లే షర్మిలక్క, పురంధేశ్వరక్క వీడియోలు కూడా చూస్తాంటే వాళ్లు ఇంతేయా.. సెల్‌ఫోన్ ఎత్తితే కొత్త వీడియో.. దానిపక్కనే వాళ్ల పాత వీడియోలు కనిపిస్తాండాయి.. ఇప్పుడు వీళ్లు మాట్లాడిని కొత్త వీడియోలు చూస్తే వీళ్లనెవరైనా నమ్ముతారా శివా..? అంతా నాలుక మడత పెట్నోళ్లేయా సామీ..'' అని హరి ముక్తాయింపునిచ్చాడు. ఆపై ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

-పలమనేరు